# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 20, ఏప్రిల్ 2026


# గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతోనే నేడు అభివృద్ధి పనులు

* మంత్రి వివేక్ చెన్నూరుకు కొత్తగా చేసిందేమీ లేదు
* మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్
* బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



**చెన్నూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతోనే నేడు మంత్రి వివేక్ వెంకటస్వామి అభివృద్ధి పనులు చేస్తున్నాడే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంలో తెచ్చిన నిధులతో కాదని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ తుమ్మ రమేష్ తో పాటు మరికొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు అయిన నిధులతో చెన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నేనే అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివేక్ చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిపోయిందని, గతంలో బిఆర్ఎస్ పార్టీ తెచ్చిన నిధులతోనే ప్రస్తుతం మంత్రి వివేక్ పనులు చేస్తున్నారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మిగతా 2లో..

# అటవీ గ్రామాల్లో అభివృద్ధి దీప్తి

* ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇండక్షన్ స్టౌవ్‌లు, సోలార్‌లైట్లు ప్రారంభం
* పైలెట్ ప్రాజెక్టుగా గిరిజన గ్రామాల ఎంపిక



**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

పెంచికల్‌పేట్ మండలంలోని అటవీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు పడుతున్నాయి. ఆదివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఆధ్వర్యంలో అటవీశాఖ పర్యవేక్షణలో అగర్ గూడ, గుండేపల్లి గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగర్ గూడ, గుండేపల్లి గ్రామాల్లోని 30 కుటుంబాలకు మొదటి విడతలో ఇండక్షన్ స్టౌవ్‌లను పంపిణీ చేశారు. అనంతరం, గుండేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రెవాల్, డివిజనల్ అధికారి అయ్యప్ప, పెంచికల్ పేట్ ఎఫ్ఆర్వో అనిల్ కుమార్, ఎంపిడిఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు అల్లూరి రాజేశ్వరి, కొండ్రా సులోచన, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ తప్పుడు ప్రచారం

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**



మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని డిసిసి అధ్యక్షురాలు సుగుణ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని మహిళా వ్యతిరేక పార్టీగా ముద్ర వేయడానికి బీజేపీ కావాలనే పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లోనే పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ మహిళా రిజర్వేషన్ల అమలును నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్), పార్లమెంట్, శాసనసభ స్థానాల పెంపుకు ముడిపెట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న స్థానాల ఆధారంగానే మహిళా రిజర్వేషన్లను మిగతా 2లో..

## మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి

# స్పష్టమైన వైఖరి ఉంది



✦ డిసిసి ప్రెసిడెంట్ రఘునాథ్‌రెడ్డి

– క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

వివరాలు 2లో..

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. మార్కుఫెడ్ సహకారంతో నాఫెడ్ ద్వారా ఈ కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. రైతులకు అవసరమైన అవగాహన కల్పించి, కొనుగోలు ప్రక్రియలో వారికి పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతోనే నేడు అభివృద్ధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గానికి కొత్త నిధులు ఏమీ తీసుకురాలేదని, నియోజకవర్గంలోని రైతాంగ సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, సింగరేణి కార్మికుల సమస్యలను మంత్రి వివేక్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని ఆపి వేయడంతోపాటు గతంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో 500 కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో ఏర్పాటు చేయదలచిన పామాయిల్ ఫ్యాక్టరీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం నుంచి ఫ్యాక్టరీ తరలి వెళ్ళిపోయిందన్నారు. ప్రస్తుతం చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేసి బిఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాలకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా డిమాండ్ చేస్తోందని తెలిపారు. డెలిమిటేషన్ పేరుతో చిన్న రాష్ట్రాల హక్కులను దెబ్బతీసేలా, దేశ సమాఖ్య స్వరూపాన్ని బలహీనపరిచేలా బీజేపీ కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మహిళా సాధికారత, లింగ సమానత్వం, ప్రజాస్వామ్య అత్యున్నత సంస్థల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంలో నిబద్ధతతో నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, డిసిసి కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంచిర్యాల జిల్లా మాలి సంఘం నూతన కార్యవర్గ సమావేశం

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :

మంచిర్యాల జిల్లా మాలి కుల సంఘ బలోపేతం, భవిష్యత్ అభివృద్ధి దిశగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ముఖ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, సంఘం చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణ, సేవా కార్యక్రమాలు, కుల బాంధవుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ఈనెల 21వ తేది (మంగళవారం) మధ్యాహ్నం 12:30 గంటలకు, మంచిర్యాల జిల్లా తిలక్ నగర్ ప్రాంతం, 23వ డివిజన్‌లో నిర్వహించబడుతుందన్నారు. ఈ కీలక సమావేశానికి మాలి సంఘం నాయకులు, కుల పెద్దలు, మాలి కులస్తులు తప్పనిసరిగా హాజరై సంఘ అభివృద్ధికి తమ సూచనలు అందించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మాలి సంఘం అధ్యక్షులు లెండుగురి శ్యాంరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంత్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోర్లే మొండి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చెండే సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన మోహన్‌రావు పాటిల్

భైంసా, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలో నిర్వహించిన అవధూత్ పాటిల్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ పాటిల్, ఇతరులు పాల్గొన్నారు.



నిశ్చితార్థ వేడుకలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్

### మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి

# స్పష్టమైన వైఖరి ఉంది

క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మహిళా రిజర్వేషన్ బిల్ పై కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన వైఖరి ఉందని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పై బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తుందని అన్నారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కారణం కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలే అని బీజేపీ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళల రాజకీయ సాధికారతకు ఎప్పటి నుంచో కట్టుబడి ఉందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. రాజ్యసభలో మెజారిటీ బిల్లు పాస్ అయ్యిందని, లోక్ సభలో 2/3 మెజారిటీ లేక వీగిపోయిందని తెలిపారు. మహిళల హక్కుల కోసం నిజమైన చిత్తశుద్ధి కాంగ్రెస్‌కే ఉందని పేర్కొన్నారు. మొదటి మహిళ ప్రధాని, మొదటి మహిళా రాష్ట్రపతి, మొదటి మహిళా ముఖ్యమంత్రి, మొదటి మహిళా గవర్నర్, మొదటి మహిళ హోంమంత్రిలను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. 2023లో బీజేపీ ప్రభుత్వం బిల్లును పార్లమెంట్ లో పాస్ చేసి ఎందుకు చట్టం చేయలేదో ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో అనేక లోపాలున్నాయని తెలిపారు. మహిళా బిల్లును పునర్విభజనతో లింక్ చేయడం ద్వారా రాజకీయ లాభం పొందాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. బిల్లు పాస్ చేసి చట్టం అమలు మాత్రం ఆలస్యం చేయడం, మరోవైపు పునర్విభజన ద్వారా కొన్ని రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నమే అని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు, మహిళలకు విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళల హక్కుల కోసం అనేక చట్టాలు, లక్షలాది మహిళలు నాయకత్వంలోకి రావడానికి కాంగ్రెస్ మార్గం సుగమం చేసింది కాంగ్రెస్సే అని చెప్పారు. మహిళల హక్కులు రాజకీయాల కోసం కాదు అవి వారి రాజ్యాంగ హక్కులని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళల పక్షాన నిలుస్తుందని నిజమైన సాధికారత కోసం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్ రామకృష్ణాపూర్ పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, గుర్రం శ్రీనివాస్, కాంగ్రెస్ యువజన నాయకులు మంతెన రంజిత్, బోనగిరి రవి, రాం సాయి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించిన శ్రీతేజకు సిపిఎం నాయకుల అభినందనలు

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :

రాష్ట్ర స్థాయిలో 994 మార్కులు సాధించి నాలుగో ర్యాంకు పొందిన కాగజ్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని గోమస్ శ్రీతేజను సిపిఎం పార్టీ నాయకులు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె. రాజన్న, సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, నాయకులు జాడి మల్లయ్య మాట్లాడుతూ శ్రీతేజ సాధించిన ఈ విశిష్ట ప్రతిభ కాగజ్‌నగర్ ప్రాంతానికే కాకుండా మొత్తం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసి, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ఇలాంటి ప్రతిభలు మరింత వెలుగులోకి వస్తాయని వారు తెలిపారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత కలిసివచ్చినప్పుడు మాత్రమే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా గోమస్ శ్రీతేజ మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

## మంచిర్యాలలో చలివేంద్రాలు ప్రారంభం

నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ఎండల తీవ్రత దృష్ట్యా పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పర్యవేక్షణలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిది



ప్రధాన కేంద్రాల్లో ఈ తాగునీటి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఈ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని బస్టాండ్, బెల్లంపల్లి చౌరస్తా, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలివాడ, ఓవర్ బ్రిడ్జి, ఫ్లడ్ కాలనీ, సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో బాటసారులకు ఇబ్బంది కలగకుండా ఈ చొరవ తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద ఘటనపై

### అధికారుల పంచనామా

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:



మండలంలోని బుర్కాపల్లి గ్రామ శివారులో శనివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు రైతులకు చెందిన పంట పొలాలు, వ్యవసాయ సామాగ్రి దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేస్తూ పంచనామా నిర్వహించారు. అధికారుల వివరాల ప్రకారం.. జాటవే కైలాష్‌కు చెందిన సర్వే నంబర్ 8లోని రెండెకరాల పొలంలో సర్వీస్ వైర్, కేబుల్ వైర్, ఇతర సామాగ్రి కాలిపోవడంతో సుమారు 70 వేల రూపాయల నష్టం వాటిల్లింది. అలాగే, గేడం వనితకు చెందిన సర్వే నంబర్ 10లోని 1.20 గుంటల పొలంలో జొన్న పంట, సోలార్ వైర్లు అగ్నికి ఆహుతి కావడంతో దాదాపు 55 వేల రూపాయల మేర నష్టం జరిగినట్లు అంచనా వేశారు. మొత్తంగా 1.25 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు పంచనామాలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాథోడ్ నూర్ సింగ్, జీపీఓ కె. రవీందర్, సర్పంచ్ మహేందర్, గ్రామస్తులు సిడం గంగాధర్, సంతోష్, దామోదర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## 39 ఏళ్ల సేవకు ఘన వీడ్కోలు

### - ఉపాధ్యాయుడు సల్ల అమృత్‌కు విశిష్ట సన్మానం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సల్ల అమృత్ 39 ఏళ్ల సుదీర్ఘ సేవ అనంతరం ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా సల్ల అమృత్ మాట్లాడుతూ.. తన సుదీర్ఘ సేవా కాలంలో విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేశానని, వారి అభివృద్ధిలో భాగస్వామిని కావడం గర్వంగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన అందించిన విద్యా సేవలను కొనియాడుతూ సహచర ఉపాధ్యాయులు కవితలతో ప్రశంసలు కురిపించారు. తమ గురువు గారి ప్రేరణతోనే తాము ఉన్నత స్థాయికి చేరుకున్నామని పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన శేష జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.






# నేతకాని కులాన్ని గెజిట్‌లో చేర్చాలి

### - లేనిపక్షంలో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి

### - నేతకాని సంక్షేమ సంఘం హెచ్చరిక

**బెల్లంపల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో నేతకాని కులాన్ని ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలని నేతకాని సంక్షేమ సంఘం నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. సాలె, మాలె కులాలుగా చూపించడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం రోజున బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలాలి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి గోమాస రాజం, జిల్లా ఉపాధ్యక్షుడు చదువుల వెంకట రమణ, నేతకాని మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ముడిమడుగుల గీత రాణి మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 15 లక్షలకు పైగా నేతకాని కులం జనాభా ఉన్నప్పటికీ, జనగణనలో సాలె, మాలె కులాలుగా చూపిస్తూ కేవలం 1.70 లక్షల జనాభాగా నమోదు చేయడం అన్యాయం అని విమర్శించారు. నేతకాని కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలని, ఇందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమస్యపై రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపుతూ వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో సుమారు మూడు లక్షల నేతకాని జనాభా ఉందని, అందుకే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నియోజకవర్గాన్ని నేతకాని వర్గానికి కేటాయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నేతకాని కులాన్ని గెజిట్‌లో చేర్చాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గోమాస జువ్వాజీ, గోమాస శ్రీనివాస్, దుర్గం భరత్, బెడ్డల మహేందర్, గోమాస వినోద్, గోమాస రాజేశ్వర్, చల్లూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామి స్మృతిలో మందమర్రిలో సేవా స్ఫూర్తి

**మందమర్రి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి, కళావతమ్మ జ్ఞాపకార్థం అచల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత పెరుగన్నం, మజ్జిగ, త్రాగునీరు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి (కాకా) ఎప్పుడూ నిరుపేదల కోసం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో బుల్లెట్ గాయాలు ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ధైర్యవంతుడని గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పెన్షన్ పథకాన్ని తీసుకువచ్చి, సంస్థ నష్టాల్లో ఉన్న సమయంలో ఎన్టిపిసి సహకారంతో రుణం సమకూర్చి సంస్థను నిలబెట్టారని తెలిపారు. లక్షలాది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించిన కార్మిక పక్షపాతి నాయకుడిగా ఆయన సేవలను ప్రశంసించారు. గత ఆరు దశాబ్దాలుగా కాక కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రజలకు సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆయన కుమారుడు వివేక్ వెంకటస్వామి, మనుమడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యజించారని గుర్తుచేశారు. ఉద్యమకారులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన నాయకుడిగా ఆయనను అభినందించారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కాక కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని చెప్పారు. కాక కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని పేదలకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని బండి సదానందం యాదవ్ తెలిపారు.



# కవిత ఏర్పాటు చేసే నూతన పార్టీకి కార్మికులు, ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

### - రియాజ్ అహ్మద్ - ఈనెల 25న మేడ్చల్‌లో పార్టీ ప్రకటన.. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఆవిర్భావం

**నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

తెలంగాణ ఆడబిడ్డ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయనున్న నూతన పార్టీకి సింగరేణి కార్మికులు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ అద్వయ కన్వెన్షన్‌లో ఈనెల 25న కవిత కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ పార్టీకి హెచ్ఎంఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణి సమస్యల పరిష్కారం, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఈ పార్టీ పనిచేస్తుందని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని రియాజ్ అహ్మద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు 50 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేయలేని స్థితిలో యాజమాన్యం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా కార్మికుల జీతాల కోసం ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొని వడ్డీలు కట్టడం దారుణమన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ముగ్గురు మంత్రులు ఉన్నా కార్మిక సమస్యలు పరిష్కారం కావడం లేదని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఈ నూతన పార్టీ నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు నిలిపివేత కారణంగా ఏడాది కాలంగా కారుణ్య నియామకాలు ఆగిపోయాయని ఆయన గుర్తు చేశారు. గతంలో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను బేషరతుగా కొనసాగించాలి. మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి. నూతన పార్టీలో కార్మికులకు అసెంబ్లీ సీట్లు ఇచ్చి గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. నైని బ్లాక్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి నిధులను దోచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై సెంట్రల్ విజిలెన్స్ విచారణ జరపాలని రియాజ్ అహ్మద్ కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2014 నుంచి జరిగిన మెడికల్ అన్‌ఫిట్‌లపై విచారణ వేస్తామని అనడం సరికాదన్నారు. ప్రభుత్వ బకాయిల కోసం త్వరలో సమ్మె నోటీసు ఇస్తామని ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కైరిగూడ నుంచి సత్తుపల్లి వరకు కవిత బాయి బాట కార్యక్రమం చేపట్టి కార్మికులను ఏకతాటిపైకి తెస్తామని వివరించారు. రాజకీయ జోక్యం నివారణకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ అశోక్, కోశాధికారి కొమురన్న, తెలంగాణ జాగృతి నాయకులు మేడి రాజశేఖర్, సురేష్, రవి కిరణ్, హెచ్ఎంఎస్ నాయకులు లక్ష్మణ్, రాజేందర్, రాజేంద్ర ప్రసాద్, తుల అనిల్, చెవుల శ్రీనివాస్, వలి, మహేందర్, రాధాకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.




గోడప్రతులను ఆవిష్కరిస్తున్న హెచ్ఎంఎస్, జాగృతి నాయకులు



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**దండేపల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన బోరే రాజమల్లు గత వారం రోజుల క్రితం అనారోగ్య రీత్యా మృత్యువాత పడడం జరిగింది వారి యొక్క కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆదివారం కన్నెపెల్లి సర్పంచ్ చుంచు నగేష్ ఆధ్వర్యంలో రూ. 5000 లను మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలోని బలహీన వర్గాల ప్రజలకు తన వంతు సహాయంగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు గూడెం కన్నెపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



## వడ్ల కొనుగోలు సెంటర్ ప్రారంభోత్సవం

**దండేపల్లి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ఐకేపి కేంద్రాన్ని ఆదివారం కన్నెపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ చుంచు నగేష్ ఆధ్వర్యంలో,ఐకెపి సంఘ సభ్యుల అధ్యక్షతన ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ముత్తె శంకరయ్య వార్డ్ మెంబర్స్ రైతులు ఐకెపి సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల యువత నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

### - జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్

**నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

2025-26 సంవత్సరానికి గాను 2 పాడి గేదెల పెంపకం పథకం కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో నమోదు చేసిన దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకొని అవసరమైన ప్రతులను జతపరిచి సంబంధిత మండల/మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించాలని, అభ్యర్థులు దరఖాస్తుతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు /ఆహార భద్రతా కార్డు, కుల ధ్రువీకరణ పత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది), ఆదాయ ధ్రువీకరణ పత్రం (మీ సేవ ద్వారా జారీ చేయబడింది, గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలి) తెలిపారు. పాడి పశువుల పథకం కొరకు పశుగ్రాసం పెంచేందుకు కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండాలని, పాస్పోర్ట్ సైజ్ ఫోటో జతపరచవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో https://tgob-mms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి ఏకం కావాలి

### ప్రతి గ్రామంలో మాలలు ఏకతాటిపైకి రావాలి - మండల మాల నాయకుల పిలుపు

**జన్నారం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న మాల సభ్యులందరూ ఏకతాటిపైకి వచ్చి తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలని జన్నారం మండల మాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రోజు జన్నారం పట్టణంలో వారు మాట్లాడుతూ... చిన్నా, పెద్దా సమస్య ఏదొచ్చినా ఇతరులపై ఆధారపడకుండా మాల సంఘం ద్వారానే పరిష్కరించుకునేలా అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు కోరారు. ప్రభుత్వం మాలల పట్ల చిన్నచూపు చూస్తోందని, అందువల్ల ఇతర సంఘాల మాదిరిగా ఐకమత్యంగా ఉండి హక్కుల సాధన కోసం ఏ ఉద్యమానికైనా సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బొట్ల సంజీవ్, అక్కవత్తుల దేవయ్య, పిట్ట రాజారావు, గద్దల పవన్ కుమార్, నల్ల తిరుపతి, మేకల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు

**- హాజరుకానున్న 549 మంది విద్యార్థులు - ఏర్పాట్లను పరిశీలించిన మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**



ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పరీక్షా కేంద్రంలో ప్రధాన పర్యవేక్షకురాలిగా ఆత్రం ప్రమీల, విభాగాధికారిగా రవికుమార్ విధులు నిర్వహించనుండగా, ఈ కేంద్రంలో 203 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల పరీక్షా కేంద్రంలో ప్రధాన పర్యవేక్షకురాలిగా పాక శ్రీలత, విభాగాధికారిగా నీలయ్య విధులు నిర్వర్తించనుండగా, ఈ కేంద్రంలో 211 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పాత) పరీక్షా కేంద్రంలో ప్రధాన పర్యవేక్షకుడిగా నజీర్ అహ్మద్, విభాగాధికారిగా తంగడిపల్లి రాకేష్ విధులు నిర్వహించనుండగా, ఈ కేంద్రంలో 135 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తంగా 549 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 20 నుండి 27 వరకు నిర్వహించబడతాయని, ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు, పర్యవేక్షణ మరియు భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయని, విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు హాజరై నియమ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి సూచించారు.

# గేదెలకు తీవ్ర గాయాలు

**జన్నారం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

వన్యప్రాణుల వేట కోసం అమర్చిన పంది గోలీలు కొరకడంతో మూడు గేదెలకు తీవ్ర గాయాలైన ఘటన జన్నారం మండలం బాదంపల్లి గోదావరి రేవు వద్ద చోటుచేసుకుంది. బాదంపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపర్లు దుమల్ల కేశన్న, దుమల్ల నారాయణ, గొట్ల లింగన్న ఆదివారం గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన గేదెలను మేత కోసం గోదావరి నది తీర ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం అమర్చిన పంది గోలీలను గ్రామానికి చెందిన మల్లెపల్లి శంకరయ్య, గడిపెల్లి నర్సయ్య, సామల్ల రాజన్నలకు చెందిన మూడు గేదెలు వాటిని ఆహారంగా భావించి పొరపాటున నోట కొరకడంతో అవి పేలిపోయాయి. దీంతో ఆ మూడు గేదెల మూతి, ముఖ భాగం నుజ్జునుజ్జు అయి తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశువుల కాపర్లు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ మధ్యాహ్నం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మూడు గేదెలకు మూతి భాగం నుజ్జునుజ్జు అయి తీవ్ర గాయాలయ్యాయని వాటికి చికిత్స నిమిత్తం పశు వైద్యశాలకు తరలించామని ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. వన్యప్రాణుల వేట కోసమే పంది గోలీలు అమర్చి ఉంటారని అనుమానిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎవరైనా వేట కోసం పంది గోలీలను అమరిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రొసీడింగ్ కాపిని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్

## అంబుగామ్ గ్రామానికి రూ. 8 లక్షల సిసి రోడ్లు మంజూరు

**భైంసా, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

కుంటాల మండలం అంబుగామ్ గ్రామ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్ 8 లక్షల రూపాయల విలువైన సిసి రోడ్లను మంజూరు చేశారు. భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు జాదవ్ బాబు, వైద్య నాథ్‌లకు ఆయన అందజేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు అట్టళ్ దేవిదాస్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శ్యాం రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి

**భైంసా, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఎండల తీవ్రతపై సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతలు శరీరంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, బయట పనిచేసే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 నుండి 3 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని కోరారు. మద్యం, టీ, కాఫీ, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, నూనె, ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే ప్లాన్ చేసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, క్యాప్ లేదా టవల్ వాడాలని తెలిపారు. వేసవిలో కాటన్ దుస్తులు ధరించడం ఆరోగ్యానికి మేలని ఆమె పేర్కొన్నారు.




## ఎమ్మెల్యే చొరవతో పెరిగిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

**సారంగాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చొరవతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల సంఖ్య పెరిగింది. గతంలో మండల మార్కెట్ యార్డులో ఒకే కేంద్రం ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైతుల కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే, కొనుగోలు కేంద్రాలను పెంచాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, మండలంలోని కౌట్ల(బి), జామ్, అల్లూరు, చించోలి(యం) గ్రామాల్లో కొత్తగా నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. తమ ఇబ్బందులను గుర్తించి కొనుగోలు కేంద్రాలు ఇప్పించినందుకు మండల రైతులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన విఠల్ రెడ్డి

**భైంసా, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

భైంసా పట్టణానికి చెందిన బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన అబ్దుల్ వహీద్ అఖిఫ్‌కు 24,005 రూపాయలు, సుమేరా పర్వీన్‌కు 47,500 రూపాయల విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య భద్రతకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. చెక్కులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండి ఫరూక్ అహ్మద్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకాని మహర్ సామాజిక వర్గానికి తీరని అన్యాయం

**- నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు**

**- రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉంటే లక్షన్నరగా చూపడం దారుణం.. నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆవేదన**

**నస్పూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకాని మహర్ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని నేతకాని మహర్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు ఆరోపించారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో నేతకానీలు 15 లక్షలకు పైగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇటీవల జరిపిన కుల గణనలో కేవలం 1,70,254 మంది ఉన్నట్లు చూపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తప్పుడు గణాంకాల వల్ల తాము ఎస్సీ రిజర్వేషన్లలో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నేతకానీలను మాలసాలెలతో కలపడంపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాలసాలె కులస్తులకు తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మాలలతో కలిపి ఉంచడం వల్ల నేతకాని కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వాస్తవ జనాభా ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతకాని కార్పొరేషన్ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని రాష్ట్ర యువజన అధ్యక్షుడు అనపర్తి యువరాజు కోరారు. కార్పొరేషన్‌కు భారీగా నిధులు కేటాయించి కులస్తుల అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు కామెర అనూష మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జాడి తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, నస్పూర్ మండల అధ్యక్షుడు దుర్గం శివరాం, బేంబడి గురువయ్య, ముడిమడుగుల శ్రీనివాస్, జునుగురు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

## హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు భోనగిరి సతీష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని తన నివాసం వద్ద హిందూ సమ్మేళనముకు సంబందించి కరపత్రాలు సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రేమల గార్డెన్లో జరుగే హిందూ సమ్మేళనంలో హిందూ బంధువులందరు అత్యధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామాఖ్య దేవస్థానం ప్రధాన అర్చకులు భవానీ స్వామీజీ, ప్రధాన వక్తగా సామాజిక కార్యకర్త హిందూ ఆక్టివిస్ట్ సౌమిత్రి లక్షణాచార్య వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి ఉపాధ్యక్షులు కాంద్రే విశాల్, కార్యదర్శి ఆకుల సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ గందం శ్రీనివాస్, ఆర్ ఎస్ఎస్ సంపర్క ప్రముఖ్ నాగుల శ్రీనివాస్, సరస్వతీ శిశుమందిర్ ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు, జంజిరాల శ్రీనివాస్,సోమ శ్రీకాంత్, సురేష్ చారి పాల్గొన్నారు.



హరే కృష్ణ నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

## హరినామ సంకీర్తన అత్యంత పవిత్రమైంది

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

హరినామ సంకీర్తన అత్యంత పవిత్రమైందని ఇస్కాన్ ప్రచారకర్త కృష్ణ చైతన్య స్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథ స్వామి ఆలయంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో హరే కృష్ణ నామ సంకీర్తన ప్రచార కార్యక్రమాన్ని భక్తి భావంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగంలో హరినామ సంకీర్తన అత్యంత పవిత్రమైన యుగధర్మమని తెలిపారు. భగవంతుని నామస్మరణ ద్వారా మనసుకు ప్రశాంతత, జీవితానికి ఆధ్యాత్మిక దిశ లభిస్తుందని వివరించారు. సమాజంలో శాంతి, సౌహార్దాన్ని నెలకొల్పడంలో హరినామ సంకీర్తన కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజు భగవన్నామాన్ని జపిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో వేణుగోపాల్ గుప్తా, బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు గిరీష్ ఆచార్య, అభయ్, స్వాతి మసాడే, సుగుణకర్ ప్రదీప్ ఆచార్య, వారణాసి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి.. అండగా ఉంటాం

**- గురుకుల పాఠశాల విద్యార్థినిలకు మహిళా కానిస్టేబుళ్ల భరోసా**

**చెన్నూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**



గురుకుల పాఠశాలలో ఏమైనా ఇబ్బందులున్నా, తోటి విద్యార్థినులతో సమస్యలున్నా అధైర్యపడవద్దని వెంటనే మా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే మీకు అండగా ఉంటామని చెన్నూరు పట్టణ పోలీస్ స్టేషన్ మహిళా పోలీసులు విద్యార్థినిలకు ధైర్యం చెప్పారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ సూచన మేరకు స్టేషన్ మహిళా కానిస్టేబుళ్లు సాహెరా, మనీషాలు పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో సమావేశమై వారితో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మంచిగా చదువుకోవాలని, ఏమైనా సమస్యలు ఉన్నట్లైతే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పాఠశాలలో తోటి విద్యార్థినిలతో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఇకపై వారానికి రెండు సార్లు పాఠశాలను సందర్శించి వారితో మమేకం అవుతామని, వారికి సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరచటం జరుగుతుందన్నారు. అదేవిధంగా ట్రాఫిక్, రోడ్డు భద్రత కు సంబంధించి గురువారం పాఠశాలలో డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించామని, విద్యార్థినిలకు పెన్నులు, స్నాక్స్ ఇచ్చామని తెలిపారు.

## ఉపాధ్యాయురాలు చంద్రకళకు ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బీబ్రా ప్రధానోపాధ్యాయురాలు ఎల్గం చంద్రకళ ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో ఆమెకు గౌరవార్థం సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సర్ సిల్క్ బ్రాంచి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్, పిఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ పాల్గొని చంద్రకళను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రకళ ఉపాధ్యాయురాలిగా ఎంతో మంది విద్యార్థులకు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణను నేర్పించి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ బీబ్రా పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు, దహేగాం మరియు కాగజ్‌నగర్ మండలాల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్



మాట్లాడుతున్న పద్మశాలీ సేవా సంఘం సభ్యులు

## పద్మశాలి కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

పద్మశాలి కుల బాంధవులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మా దృష్టికి తీసుకువస్తే మేము శాయశక్తుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పూర్తిస్థాయి కమిటీని త్వరలో భర్తీ చేస్తామని వారు తెలిపారు. ఆదివారం కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్ల గౌడ్ తోటలో గల పద్మశాలి కమ్యూనిటీ హాలులో నూతనంగా ఎన్నుకోబడిన కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షునిగా గుల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వడ్లాల వెంకన్నను, కోశాధికారిగా కొక్కుల మురళిని, జాయింట్ సెక్రటరీగా బోగ వెంకటేశంను ఎన్నుకున్నందుకు పట్టణ పద్మశాలి కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు తెలిపారు.



హోమం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

## ఎల్లూర్‌లో పోచమ్మ తల్లి పునఃప్రతిష్ఠాపన

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్లూరు గ్రామంలో పోచమ్మ తల్లి పున ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం భక్తి శ్రద్దల మధ్య ఘనంగా జరగనున్నట్లు గ్రామ సర్పంచ్ చప్పిడి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గత రెండు రోజులుగా యగ్నాలు, హోమాలు, ప్రత్యేక పూజలు అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సోమవారం పున ప్రతిష్టాపన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ మహా నైవేద్యం హారతులు నిర్వహించబడునున్నట్లు, అర్చకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పున ప్రతిష్టాపనతో గ్రామంలో శాంతి సౌభాగ్యం సస్యశ్యామలం పెరుగుతుందని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు సమీప గ్రామాల భక్తులు కూడా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

# విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం నర్లపూర్ గ్రామంలో సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం కాగజ్‌నగర్ మండలంలోని కోస్ని గ్రామంలో విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కోస్ని గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాల వద్ద మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురి శ్యామ్‌రావు చేతుల మీదుగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్లపూర్‌లో జరగనున్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమస్త మాలి కుల బాంధవులు, సంఘ నాయకులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల అధ్యక్షుడు వడై బాబురావు, మండల ప్రధాన కార్యదర్శి వస్తాకే హనుమంతు, ముండోర్ వెంకటేష్, మాలి సంఘం నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లెండుగురే శ్యామ్‌రావు,తదితరులు